# కేసీఆర్ హయాంలోనే విద్యకు ప్రాధాన్యత

- ఇంటర్‌తోనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

ధారూరు, అక్టోబర్ 8 : ఇంటర్ విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, కేసీఆర్ హయాంలోనే విద్యకు, రైతులకు ప్రాధాన్యత కల్పించారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మంగళవారం ధారూరులో కోస్నం లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం గత సంవత్సరం(2023-2024)లో 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మాజీ జడ్పీటీసీ సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన, సన్మాన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబితారెడ్డి హాజరయ్యారు. ధారూరు మండల పరిధిలోని ధారూరు బాలుర, ధారూరు బాలికల, నాగారం, కెరెళ్లి, మోమిన్‌కలాన్, తరిగోపుల, నాగసముందర్, కుక్కింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు కేజీబీవీ పాఠశాలల్లో(2023-2024) 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన 175 మంది విద్యార్థులను సన్మానించి మెమొంటోలను అందజేశారు.


అభినందన సభకు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నాయకులు

ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు జాగ్రత్తగా చదువుకున్నప్పుడే వారి భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. కేసీఆర్ గురుకులాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. వికారాబాద్‌లో డిగ్రీ, మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంటర్‌లో బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాలో వచ్చే మంచిని స్వీకరించి, చెడును వదిలేయాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు రూ.10వేలు, ఇంటర్ రూ.15వేలు, డిగ్రీ రూ.20వేలు, పీజీ విద్యార్థులకు రూ.లక్ష ఇస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పటివరకూ ఇవ్వలేదని ఆమె పేర్కొన్నారు.

కార్యక్రమంలో సబితానంద్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సబితానంద్, మౌలిక సదుపాయాల శాఖ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వికారాబాద్ మాజీ ఎంపీపీ చంద్రకళ, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, అక్టోబర్ 8 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా.. వారు పండించిన పత్తి పంటను కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులు, ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 2లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశముందని, 2024-25 సీజన్ పత్తి కొనుగోలు ప్రారంభం కానున్న దృష్ట్యా జిన్నింగ్ మిల్లుల వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోళ్లకు రైతుల ఆధార్ ప్రామాణికమని, రైతులందరూ తమ బ్యాంకు అకౌంట్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకునేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో ఫీడ్ కాని రైతుల లిస్టుకు ఏఈవో సర్టిఫై చేస్తే ఆన్‌లైన్ ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నకిలీ సర్టిఫికెట్‌లు జారీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు గ్రేడ్-1కు మద్దతు ధర రూ.7521, గ్రేడ్-2 రకానికి రూ.7121 నిర్ణయించిందన్నారు. ప్రతి పత్తి మిల్లు వద్ద ముందస్తుగా తూకం యంత్రాల పని తీరును పరిశీలించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా ఫైర్‌శాఖ ఏర్పాట్లు చేయాలన్నారు. జిన్నింగుమిల్లుల వద్ద పోలీస్, రవాణా శాఖల అధికారులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో రైతులెవ్వరు కూడా జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకురాకూడదని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, సీసీఏ బ్రాంచ్ మేనేజర్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సదరం క్యాంపులు

జిల్లాలోని దివ్యాంగులకు అక్టోబర్ నెలకు సంబంధించి సదరం క్యాంపులను నిర్వహించనున్నట్లు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరు ప్రభుత్వ దవాఖానలో అక్టోబర్ 10న శారీరక అంగవైకల్యంగల 60 మందికి, 14న బుద్ధి మాంద్యం గల 50 మందికి, 24న శారీరక అంగవైకల్యంగల 60 మందికి, 28న బుద్ధిమాంద్యంగల 50 మందికి, 30న వినికిడి లోపంగల 60 మందికి క్యాంపులను నిర్వహించి పరీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అక్టోబర్ 10న శారీరక అంగవైకల్యం గల 60 మందికి, 18న చూపులేని 50 మందికి, 24న బుద్ధిమాంద్యంగల 50 మందికి, 29న శారీరక అంగవైకల్యంగల 60 మందికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇదివరకు సదరం సర్టిఫికెట్ పొంది సర్టిఫికెట్ కాల పరిమితి అయిపోయిన వారితో పాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న వారితో సహా 500 మందికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.


సమావేశానికి హాజరైన ఆయా శాఖల అధికారులు, ట్రేడర్లు

## పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి



బషీరాబాద్, అక్టోబర్ 8 : పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. హైదరాబాద్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఈ మేరకు మంగళవారం ప్రకటించారు. మండలంలోని జీవన్గి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి గత 15 సంవత్సరాలుగా సంఘంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. యాలాల మండలంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో సంఘం ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సేవలందించారు. అలాగే రాష్ట్ర కార్యవర్గంలోకి రవికాంత్, నాగరాజు, సాజీదాబేగం, భీంరెడ్డి, అయూబ్‌పాషాకు స్థానం కల్పించారు. రాష్ట్ర కార్యవర్గంలో బషీరాబాద్ మండలానికి భారీగా పదవులు దక్కడం పట్ల పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలి

అదనపు కలెక్టర్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం


అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రంగారెడ్డి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ గ్రామ పరిధిలోని సర్వే నం.212/1లో శ్మశానవాటిక కోసం కేటాయించిన రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకొని కాంపౌండ్ వాల్ నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు జాన్ వెస్లీ, పగడాల యాదయ్య మాట్లాడుతూ.. సుందరయ్య కాలనీ, ఇందిరమ్మ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, కమ్మగూడలోని వివిధ కాలనీల్లో బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేద కుటుంబీకులకు శ్మశానవాటిక లేకపోవడంతో సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడంతో సర్వే నం.212లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు తెలిపారు. కానీ.. ప్రహరీని నిర్మించకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఇప్పటికే సుమారు ఎకరానికి పైగా అన్యాక్రాంతం చేశారని పేర్కొన్నారు. రీ సర్వే చేసి ఆక్రమణలు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు కాంపౌండ్ వాల్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ నాయకులు ఉన్నారు.

## మూసీ సుందరీకరణ ఎవరి కోసం..?

- రూ.1.5 లక్షల కోట్లు మురుగులో పోస్తారా..?
- పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను మర్చిపోయారు
- రాష్ట్ర సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ చైర్మన్ రాజావరప్రసాద్

షాద్‌నగర్, అక్టోబర్ 8 : మూసీనది సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఉసురు పోసుకుంటున్నారని రాష్ట్ర సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ మండిపడ్డారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ వైపు రాష్ట్రం అప్పులపాలైందని ఉపన్యాసాలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ పేరుతో రూ.1.5 లక్షల కోట్ల నిధులను కేటాయించడం దేనికి నిదర్శనమన్నారు. పేదల బాగోగులను మర్చిపోయిన ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో దోపిడీకి తెరలేపాయని, మూసీ పరివాహక ప్రాంత ప్రజల సంక్షేమం, పునరావాసం వంటి అంశాలను పట్టించుకోవడం లేదన్నారు. నిత్యం మూసీ నది మురుగుతో రాజకీయం చేస్తూ కాలం గడుపుతున్నారని తీవ్రస్థాయిలో ఆరోపించారు. మూసీ పరిధిలోనున్న హైకోర్టు, ఎంజీ బస్టాండ్, సాలార్‌జంగ్ మ్యూజియం వంటి ఎన్నో కట్టడాలున్నాయని, వాటిని కూల్చే దమ్ము సీఎంకుందా అని ప్రశ్నించారు. ఓ వైపు సాగు నీరు లేక రాష్ట్ర రైతులు అరిగోస పడుతుంటే ప్రజలకు అక్కరకు లేని ప్రాజెక్టులను ముందరేసుకొని కోట్ల నిధులను కాజేసేందుకు పథకం వేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఎన్నడు కూడా పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రస్తావనే లేదని, ఒక్క పైస కూడా కేటాయించలేదన్నారు. షాద్‌నగర్ ప్రాంత రైతుల కోసం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను ప్రారంభించాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి చిన్న విషయానికి నిరసనలు తెలిపిన నాయకులు నేడు పేద లు నట్టేట మునుగుతున్న ఎందుకు స్పందించరన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సీహెచ్‌సీ తనిఖీ

బషీరాబాద్, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను, మండలంలోని నవాల్గా ప్రాథమిక దవాఖానను తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దవాఖాన లోపల, బయట కలియతిరిగి పరిశీలించారు. దవాఖానలో కాలం చెల్లిన మందులు ఏమైనా ఉన్నాయా.. మందులను భద్రపర్చే విధానాన్ని చూశారు. అనంతరం సౌకర్యాలపై వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రతి రోజూ దవాఖానకు వైద్యం కోసం ఎంత మంది బయటి రోగులు వస్తారని అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల మంచి ప్రవర్తనతో ఉండి మంచి వైద్యం అందించాలన్నారు. రోగులతో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. సేవలు, వైద్యం ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారు. నవాల్గా గ్రామ ప్రజలు సబ్ కలెక్టర్ వచ్చిన విషయం తెలుసుకుని మెరుగైన సేవలు అందించేలా చూడాలని వారు విన్నవించారు.


రోగులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

## అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన

కులకచర్ల, అక్టోబర్ 8 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేసిన పనులను వికారాబాద్ డీఆర్డీవో శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. మండల పరిధిలోని బండవెల్కిచర్ల ఉర్దూ మీడియం పాఠశాలలో నిర్వహించిన పనులకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. నిర్వహించిన పనులకుగాను సరిపోను బిల్లులు చెల్లించలేదని, తమకు న్యాయం చేసి బిల్లులు సక్రమంగా అందించాలని కమిటీ సభ్యులు కలెక్టర్‌కు ఇటీవల విన్నవించారు.

ఈ నేపథ్యంలో మంగళవారం కులకచర్ల మండలానికి నాలుగు టీంలుగా ఏఈలు, డీఈలు చేరుకొని ప్రతి పాఠశాలలో నిర్వహించిన పనుల గురించి ఆరా తీసి రికార్డులో నమోదు చేశారు. పాఠశాలల్లో నిర్వహించిన పనులకుగాను చేసిన పనులకు తప్పనిసరిగా రికార్డుల ప్రకారం బిల్లులు అందజేస్తారని తెలిపారు. కాగా తాము చేసిన పనులకు డబ్బులు ఎక్కువగా ఖర్చు కాగా సగం డబ్బులు కూడా బిల్లులు రాలేదని తాము అప్పులపాలయ్యామని కమిటీ సభ్యులు తెలిపారు.

అధికారులు స్పందిస్తూ చేసిన పనులకుగాను సక్రమంగానే రికార్డులు చేయడం జరిగిందని తెలిపారు. లేబర్ పేమెంట్ ఎక్కువగా పెట్టినందున.. అంత బిల్లులు రాలేదని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని టీం బృందం పేర్కొన్నారు. కార్యక్రమంలో కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ, ఏపీఎం శోభ, ఏఈ మణికుమార్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అలివేణి, అధికారులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.


బండవెల్కిచర్ల పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో శ్రీనివాస్, అధికారులు

## రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలి

రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి


సమావేశంలో మాట్లాడుతున్న గోపి

బొంరాస్‌పేట, అక్టోబర్ 8 : రాష్ట్రంలో రజకుల సంక్షేమానికి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించి సంక్షేమానికి పాటుపడాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక అన్నారు. మంగళవారం దుద్యాలలో నిర్వహించిన మండల రజక సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపి మాట్లాడుతూ.. గత బడ్జెట్‌లో రజకుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.150 కోట్లను కేటాయించి అందులో రూ.100 కోట్లను విద్యుత్ బకాయిలకు, రూ.50 కోట్లను సంక్షేమ పథకాలకు కేటాయించడం బాధాకరమన్నారు. 2016 డిసెంబర్ 26న రజకుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎమ్మెల్యే హోదాలో రేవంత్‌రెడ్డి మాట్లాడారని, నేడు సీఎం హోదాలో రూ.500 కోట్లు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి రజకులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దుద్యాల వార్డు సభ్యుడు చెన్నప్ప మాట్లాడుతూ.. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చినప్పుడే తమకు సామాజిక న్యాయం కలుగుతుందని గోపి పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, సంయుక్త కార్యదర్శి వెంకటయ్య, గ్రామ ఉపాధ్యక్షుడు అంజయ్య పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి


## గెలుపు కన్నా క్రీడల్లో పాల్గొనడం ముఖ్యం

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 8 : క్రీడల్లో ఓటమే గెలుపునకు నాంది అని, ఓటములే జీవిత పాఠాన్ని నేర్పుతాయని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో శిక్షణా పోలీస్ కానిస్టేబుళ్ల స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కానిస్టేబుళ్లకు వాలీబాల్, టగ్ అఫ్ వార్, 100మీ., 200మీ., క్రికెట్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూజజ క్రీడలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులను చేస్తాయన్నారు. స్నేహభావం పెరుగుతుందని, ఆనందంగా ఆడాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఎస్పీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్ మురళీధర్, జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, సీఎల్ఐ, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

### విద్యార్థులను అభినందించిన ఎస్పీ

షాద్‌నగర్‌లోని గ్రీన్ పార్కు ఫంక్షన్ హాల్లో ఈగల్ కుంగ్-ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఓపెన్ నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని కస్తూర్బాగాంధీ విద్యార్థినులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో అ విద్యార్థులను మంగళవారం ఎస్పీ అభినందించారు.



మంగళవారం కేంద్ర ప్రభుత్వ పరిశ్రమల మంత్రిత్వ శాఖ స్థాయి సంఘ సమావేశంలో పాల్గొనడానికి వెళ్లిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కలిశారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన వివిధ విషయాలపై పరస్పరం చర్చించామని ఎంపీ తెలిపారు.
– వికారాబాద్, అక్టోబర్ 8



# రంగారెడ్డి కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు







రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పండుగ కార్యక్రమానికి కలెక్టర్ శశాంక ముఖ్య అతిథిగా హాజరై, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీతలతో కలిసి పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు.